# సౌభాగ్యవతి

కాని, ఒకటిమాత్రం నిజం. ఆవిడ గర్వికాదు. అలాగని కొంత మంది అనుకుంటారేగాని, ఇంతకీ గర్వం ఒక పెద్ద గర్వకారణ మేమీ కాదుగా !

మరి అదేమిటో అంతమౌనం. ఆమెనోట యెవరైనా, ఎప్పుడైనా మహా అయితే ఒకమాట వింటారేమో, అదైనా అరుదుగా, బంధువు లెవరైనా యింటికొస్తే యే మూడుదినా లయ్యాకో "ఎప్పుడొచ్చారు ?" అని ముక్తసరిగా పలుకరించి జవాబైనా యెదురుచూడ దావిడ.

అసలు శ్రీదేవిగారు కాస్త సంపన్నురాలాయె. మాట్లాడవలసిన బాధ్యతలూ ఎక్కువగా లేవు. ఇంట్లో వంటలూ, వడ్డింపులూ—విధవాడ బడుచు చూస్తూండేవారు. రమణమూర్తిగారు భారతం చదువుకుంటూ పడకకుర్చీలో కూర్చుని వుండేవారు. చుట్టూ గరిసెలనిండా ధాన్యం, పాడి-పంటలూ, అతిథులూ-అభ్యాగతులూ, పూజలూ-పునస్కారాలున్నూ—చక్కని కుటుంబం, లక్షణంగా బంగారుబొమ్మలా ఆభరణాలంకారాలతో శ్రీదేవిగారు కాలి మట్టెల రవళితో, మౌనంగా తిరుగుతూంటే ఆవిణ్ణి మెచ్చని ప్రాణిలేదు. శ్రీదేవిగారికి తన ప్రపంచమే తనది. తానే తన ప్రపంచం. తనకి తానుకాక మిగతావారు తన భర్త తన ఏకైక పుత్రుడు అంటే పసుపు-కుంకుమలు, కొడుకంటే తన సర్వం. అంతే. అదే శ్రీదేవిగారి విచిత్ర మానసిక పరిధి.

పసుపుచెంపలతో, నుదుట పట్టెడు కుంకుమతో ఆవిడ యెదురొస్తేనే చాలనుకునేవాళ్లు చాలమంది. పెళ్ళి అంతా సిద్ధమయ్యాక తాంబూలాలు యిచ్చి పుచ్చుకోడాని కెళ్లేవాళ్లు, గొడుగు కండువాలతో వాళ్ళ ఆడవాళ్ళని శ్రీదేవిగా రింటికి పంపించి "కాస్త నాలుగడుగులు ఎదురు రండమ్మా" అని బ్రతిమాలించేవారు.

ఎటొచ్చీ మౌనం ఒక్కటే. బయటపను లన్నీ చెయ్యడానికి యింటి పాలేరు ఏనాది అంకులూ, దాసీపని చెయ్యడానికి అతని భార్య వున్నారు. అలవాటైనవాళ్లు, అడక్కుండానే చేసుకుపోతారు పనులన్నీ.

అంకాలు మూడేళ్ళకొడుకు ఒకసారి వాళ్ళ పేటలో ప్రక్కింటికి వెడితే ఆ ప్రక్కింటి ముక్కోపి ముసలిది పొమ్మని ఛటుక్కున ఒక్కటేసిందట. పిల్లాడికి డొక్కలో దెబ్బ తగిలిందట. పిల్లవాడు వుక్కిరిబిక్కిరిగా వూపిరి వదిలాడట. అంకాలుభార్య పరుగెత్తుకుంటూ వెళ్ళి ఆ ముసలిదానిని తిట్టి, యేడ్చే ఆ పిల్లాణ్ణి ఎత్తుకొచ్చేసిందట. ఆ వెనుక జడుపుమీదనో దెబ్బమీదనో వాడు జ్వరం పడ్డాడట. తిండి తగ్గిపోయింది. జ్వరం పూర్తిగా యెన్నడూ వదలలేదు. అలాగే తీసుకుతీసుకు ఒక ఆరు నెలలకి ప్రాణం కాస్తా వదిలేశాడు, వయస్సు మళ్ళుతూన్న ఆ బీద దంపతులకు చావగా చావగా మిగిలినది ఆ ఒక్క సంతే. ఈ వైనా లన్నీ యెప్పటికప్పుడు యింట్లో వింటూన్న శ్రీదేవిగారు "పాపం" అనిగాని, "అయ్యో" అనిగాని అనలేదు. విన్నదా లేదా అనిపించింది. ముఖంలో ఏమాత్రమూ మార్పులేదు. చెవిటివాడిముందు శంఖు వూదినట్టే.

కాని ఆ తరువాత ఒకసారి తన పసివాడు శివరామ్‌కి జబ్బుచేసి నప్పుడు మాత్రం ఆవిడముఖం వివర్ణమైపోయింది.

ఆ నాడు రమణమూర్తిగారు ప్రక్కవూరు పనిమీద వెళ్ళారు. విధవాడబిడ్డ తన జ్ఞాతుల పెండ్లికి వెళ్ళింది. హఠాత్తుగా శివరామ్ తన

చేతుల్లో బిగిసిపోయాడు. శ్రీదేవిగారి గుండె లాగిపోయాయి. "అయ్యో! అమ్మో!" అనుకుంటూ పిచ్చిదానిమల్లే చేతుల్లో పిల్లాడితో వీధిలోకి పరిగెత్తుకుంటూ వచ్చింది. అంకాలు చుట్ట నోట్లోపెట్టుకుని లోపలికి వస్తూ ఎదురయ్యాడు. ఆవిణ్ణి అంత దూరాన చూడంగానే నోట్లోచుట్ట పారెయ్యబోయాడు. తొందరగా మరుక్షణంలో ఆవిడ ముఖమూ పరుగూ చూసి గాభరాపడి "ఏం దమ్మగారూ ? ఏం దిది ?" అంటూ ముందుకి అంగలు వేసుకుంటూ వెళ్ళాడు. వెంటనే అతని కర్థమైంది. "చిన్నబిడ్డ గుణమండీ! సూత్తారేం" అని అంటూనే చేతిలో కాల్తూవున్న చుట్టతో బిడ్డ నుదుటిమీదా వెనకాలా వాతలు పెట్టాడు. బిడ్డ కేర్‌మని ఏడ్చాడు. శ్రీదేవిగారు బిడ్డని రొమ్ముకద్దుకుంది. అంతే. అలాగే అంకాలుకేసి తిరిగి చూడనైనా చూడకుండా మండువాలోకి వెళ్ళిపోయింది. అలాగే నిలబడిపోయి అంకాలు "పాపం! కన్నకడుపాయిరి. ఏం చేసుద్ది" అని గొణుక్కుంటూ ముందరికి సాగాడు.

ఆ నాడు తెప్పరిల్లి శివరామ్ "మ్మమ్మ" అన్న స్వరం శ్రీదేవిగారికి ప్రాణంపోసింది. జీవితంలో పరిపూర్ణ సుఖం యింకొకటి లేదనిపించింది.

శ్రీదేవిగారు యెన్నడూ బిడ్డని లాలించి యెరుగరు. కాని, ఆమె సౌభాగ్యానికి మేరలేదు. గిరి దాటని కొడుకు, కోప-తాపా లెరుగని భర్త, సిరి-సంపదలు.

శివరామ్ పెద్దవాడయ్యాడు. చదువుకుంటున్నాడు. బుద్ధిమంతుడు. అతనికి తల్లితప్ప వేరేదైవం లేదు. స్కూలునుంచి వచ్చి "అమ్మా" అని అలా దీర్ఘంగా పిలిస్తే శ్రీదేవిగారు భూత, భవిష్యత్తులు మరిచేవారు. చూచిన అమ్మలక్కలందరూ శ్రీదేవిగారి అదృష్టానికి కొంచెం యీర్ష్యపడేవారు. శివరామ్‌కి అమ్మ పెట్టింది అమృతం. అమ్మ చెప్పింది వేదం. అంతకిమించి ఆవిడకి కోరదగినదీ వేరేముంది.

పండుగలూ, పబ్బాలూ గడుస్తున్నాయి. శ్రీదేవిగారి పెద్దతమ్ముడు తల్లిలేని తన ఒక్క-కూతుర్ని వదలి స్వర్గస్తు డయ్యాడు. ఆ అనాథను రమణమూర్తిగారు యింట్లోకి తెచ్చారు. వయస్సు వచ్చిన ఆ కమలకి పెట్టుపోతల్లో లోటు లేకుండా శ్రీదేవిగారు చూస్తున్నారు. తన ఆడబిడ్డ అప్పటికే కాలంచేసిందిగనుక మాటా-మంతీమాత్రం ముక్తసరే.

ఈపాటికి కాలేజీ వదిలేసి శివరామ్ వుద్యోగం చేస్తున్నాడు గుమాస్తాగా.

ఎప్పుడో చిన్ననా డనుకున్నది తప్ప మళ్ళీ తిరిగి ఆ ప్రస్తావనే రాలేదు ఎప్పుడూ. ఐనా యిరుగు-పొరుగువారి వూహలు వూరికేపోకుండా శివరామ్‌కి, మేనకోడలు కమలకి రమణమూర్తిగారు, శ్రీదేవిగారు వివాహం చేశారు—తగువైభవంతో.

శివరామ్‌మాత్రం యెప్పటికీ తల్లిబిడ్డే. ఎప్పటిలాగ జీతం తెచ్చి తల్లిచేతుల్లో పొయ్యడం, రోజుకి ఒక అర్ధణా తీసుకొని వెళ్ళడం, ఆఫీసులో సరదాగా వేరుశనగకాయలు కొనుక్కు-తినడం, ఇంటి విషయాలలో అతను పట్టించుకొనేవాడే గాదు. పెండ్లి అయిన తరువాతా అంతే.

ఈ పెళ్ళి అయిన ఆరునెలలకే రమణమూర్తిగారికి వుప్పెనలా ముంచుకు వచ్చింది జ్వరం హఠాత్తుగా.........డాక్టర్లు కారణం తెలుసుకునేలోగానే అంత హఠాత్తుగానూ ఆయన పోయారు.

శ్రీదేవిగారి దుఃఖానికీ, రౌద్రానికీ మేరలేదు. ఈ దరిద్రురాలు యే శనివేళ నా యింట్లో అడుగుపెట్టిందో ? ఇది నా పసుపు-కుంకుమ తుడిచేసింది. దీనిని యేం చేసినా పాపంలేదు. భగవంతుడు నా పగ తీర్చడా—ఏమేమో ఆలోచనలు వచ్చినై ఆవిడకి—ఘోరమైనవి.

"పువ్వులూ బుక్కా-యితో ఆయన చేతుల్లో పుణ్యస్త్రీలా పోదామనుకున్నాను. పసుపు-కుంకుమ లేనిదే యేమి బ్రతుకు ? శ్రీదేవిగారు

పసుపు-కుంకుమలేని ఘడియలు జీవితంలో యెవరికైనా వుంటాయనే అనుకోలేదు. ఎవరికైనా అంటే తనకే. తను తప్ప తనకి ప్రపంచం ఎవరు ? శ్రీదేవిగారి మనసులో బయటప్రపంచపు ఆలోచనలకి చోటు లేదు—తనూ, భర్త, బిడ్డడు—అంతే. ఇంకే తల్లికి యే కొడుకువుంటే తనకి కావాలి ? లేకపోతే ఎవరిక్కావాలి ? ఇప్పుడు తన పసుపు-కుంకుమ పోయిందే !

అనాటినించీ ముక్తసరిగానైనా కోడలితో మాట్లాడ్డం మానేసిం దావిడ.

రెండేళ్లు గడిచాయి. ఒకనాడు సాయంత్రపువేళ నిమ్మళంగా కమల దగ్గింది. శివరామ్ గమనించలేదు. రోజురోజుకీ కమల నీరసించి పోతోంది. దగ్గు ఎక్కువై పోతోంది. ఎవ్వరూ గమనించడంలేదు. ఒకనాడు మరీ బాధగా దగ్గుతూ కూచుంది కమల. శివరామ్ విన్నాడు. అమ్మ నడిగాడు. అమ్మ నాకు తెలియదదంది. అనవసరంగా భార్యతో మాట్లాడే అలవాటు లేదు శివరామ్‌కి. అయాచితంగా కష్ట-సుఖాలు భర్తతో చెప్పుకొనే స్వతంత్రం కమల లేదు. ఇప్పు డతను అడిగితే "ఏమో, నాకు తెలియదు. ఎందుకో యీదగ్గు" అంది కమల.

ఆఖరికి ఒకనాడు అంకాలు భార్యని వెంటపెట్టుకుని కమలని లేడీ డాక్టరువద్దకి తీసుకెళ్ళాడు శివరామ్. ఆవిడ పరీక్షచేసి "శివరామ్‌గారూ ! మీరు చదువుకున్నవారు. మీరు యిన్నాళ్ళూ ఎలా వుపేక్ష చేశారు ? ఇది క్షయ" అని సానుభూతితో అంటూ, ఒక మందులపట్టీ వ్రాసి యిచ్చింది.

ఇంటికివచ్చి జరిగినదంతా అమ్మతో చెప్పాడు శివరామ్. అమ్మ మాట్లాడలేదు. విగ్రహంలా వింటూ వుండిపోయింది.

శివరామ్‌కి ఏమిచెయ్యాలో బోధపడలేదు. కాలుకాలిన పిల్లిలా అటూ యిటూ తిరిగాడు. ఇంట్లో యీ రోగిని పలుకరించే మనిషికూడా

లేరు. అందుకని కమలని ప్రక్క పల్లెటూరిలో తన పినమామగారింటికి తీసుకెళ్ళి వదలి కాస్త ఆలనా-పాలనా చూస్తుండమని చెప్పాడు. కాని మందు లెలా వస్తాయి ?

అదేమి ఖర్మమో ఎప్పటిలా జీతపురాళ్లు అమ్మ దోసిళ్ళలో పోస్తూనే వున్నాడు శివరామ్. వేరువిధంగా చెయ్యాలని అతనికి స్ఫురించనైనా స్ఫురించలేదు.

నాలుగైదు దినాల కొకసారి వెళ్ళి కమలను చూచివస్తున్నా డతను.

"మీ బస్తీలలోకంటె యిక్కడేమంత యేర్పాటు లుంటాయిరా? ఏదైనా మందు యిప్పించాలిగాని" అన్నారు పినమామగా రొకసారి శివరామ్‌తో. నిజంగానే ఆనాటి కానాటికి క్షీణిస్తోంది కమల. పోనీ వాళ్ళనే కాస్త డబ్బడుగుదామా అనుకుంటే పినమామగారూ మరీ అంత కలిగిన వాళ్ళు కారాయె. ఆ సాయంత్రం కమలతో శివరామ్ అన్నాడు—"అవునూ, చేతిలో వెన్నపెట్టుకుని నేతికి దేవులాడినట్టూ యిదేమిటి ? నీ మెళ్ళో ఆ చంద్రహారం ఇలా యియ్యి. అది తాకట్టుపెట్టి మందులు కొనుక్కొస్తా."

దానికి "ఊఁహు ! నే నివ్వను. ఇది మామగారు పెళ్ళికి పెట్టారు; ఇది తీసుకునేందుకు మీకు యేమీ హక్కులేదు" అంది బలహీనంగా తలవూపుతూ.

మరోసారి, ఇంకోనాడు అడిగిచూచాడు శివరామ్, "ఇదిగో చూడు, పరిస్థితులేమీ బాగాలేవు. అమ్మ ప్రాణంపోయినా డబ్బిచ్చేట్టుగాలేదు. ఆ చంద్రహారం యియ్యి. లేకపోతే నీవు నాకు దక్కవు" అన్నాడు. కమల గట్టిగా తల వూపింది. "నాకు బ్రతకాలని యేమీలేదులెండి. నా ప్రాణాలు నిలవాలని అత్తగారికే లేనప్పుడు మీ కెందుకింత ప్రయాస ? నా కెందుకు ?" అంది ఆయాసంతో.

మరో వారందినాలకి కమల పోయింది.

శివరామ్ దుఃఖంతో "అమ్మా! కమల పోయింది వెళదాం రా" అన్నాడు. ఆమె జవాబైనా యివ్వలేదు.

ఆ మరునాటి సాయంత్రం భార్య పాదాలకు దణ్ణంపెట్టి, సాగనంపి, పినమామగారి మిద్దెమీద అరుబైటి నడుంవాల్చాడు శివరామ్. పైన విదియనాటి ఆకాశం నీలంగా, విశాలంగా, అనంతంగా అలముకుంది. కమల ఏది? ఆ జీవి యెటు వెళ్ళిందో! ఆ అంతరిక్షంలోకి పోయిందేమో! ఎంతదూరం వెళ్ళిందో; తిరిగి రాదేమో! గుండెలు యెంత గభేలు మంటున్నాయి తలుచుకుంటే. కన్నీళ్లు యెండిపోయాయి. ఏడుపు రావడంలేదు.

శివరాంకి యేదో గొప్ప బాధనుంచి ఒడ్డుకి వచ్చినట్టు అనిపించింది. కాని, ఏదో పెద్ద ఒంటరితనం అతనిచుట్టూ ఆవరించింది. ఎంత నీలంగావుందో పైన ఆకాశం! ఆ నీలిమ కొంత శాంతి నిచ్చింది. కాని ఎప్పుడూ యీ ఆకాశాన్ని యిల్లా చూస్తూండగలమా? దూరాన్నించి కొండలూ యిలాగే కనపడతాయి. సృష్టిలో విస్తీర్ణత లన్నీ నీలమే. కృష్ణపరమాత్ముడూ అదే ఛాయ. శివుడి కంఠంలోనూ నీలమే గదూ! ఏమిటో మనస్సు బరువుగానేవుంది. కమలకి మంచిప్పించినట్టయితే బాగుండిపోను. ఎవరిప్పిస్తారు! ఔను, ఆమె అత్తగారికే పట్టనిదే. ఇంతకీ మేనరికం కావాలని చేసుకుందికూడాను. ఆవిడ కమలకి అత్తగారా? తనకిమాత్రం తల్లికాదు. అబ్బే! అమ్మ! "అమ్మ" అని పిలవడం ఎలాగు! పిలవకూడదని ప్రతిజ్ఞపట్టలేదు—ఒకవేళ అలా పట్టేవుంటే? ఎవ్వరికి? ఎవ్వరికి ఆ మాట యిచ్చింది? తన దారిన తాను వెళ్ళిపోయిన భార్య కిచ్చాడా? తనకి తానే బాధలో యిచ్చుకున్నాడా? ఏమోకాని పిలవడానికి నోరు రావడంలేదు. "అమ్మ!" ఊఁహూఁ! రావడంలేదు. ఆ పిలుపూ, దుఃఖమూ కంఠంలోనే ఆగిపోయాయి.

ఏమేమో ఆలోచనలు వస్తున్నాయి అతనికి. ఆ ఆలోచనలు బరువుగా వున్నాయి. శివరాం ముఖం కుంభవర్షాన్ని మోయలేక మోసే శ్రావణమేఘంలా అయింది.

*     *     *

ఈవేళ, తన అవసానకాలంలో శ్రీదేవిగారు మద్రాసులో కొడుకు శివరాం లోగిలిలో మెత్తటి పరుపుపైన పడుకుని వున్నారు. మందులూ, పరిచర్యలూ జరుగుతూనే వున్నాయి. డాక్టర్లు రోజు గడవదని చెప్పారు.

కాని రాత్రిపడింది.

జబ్బు యెక్కువైనతరువాతనే ఆవిణ్ణి మద్రాసు తీసుకొచ్చారు, ఇప్పటికి సుమారు మూడు నెలలక్రితం.

జబ్బుతో మంచంమీద పండుకొని వున్నన్నాళ్ళూ తన గత జీవితమంతా స్ఫురణ కొస్తూండేది. భార్య పోయినతరువాత శివరాం తనలో తానే యిమిడిపోయాడు. స్వయంగా తన జీతం తల్లి కివ్వడం మానేశాడు; అంకాలుని ఆఫీసుకి తీసుకెళ్ళి జీతం పుచ్చుకుని యిచ్చి యింటికి పంపించేవాడు.

ఇలా సంవత్సరాలుగడుస్తూండగా పినమామగారు తన కూతుర్నిచ్చి అట్టహాసంలేకుండా పెళ్ళి చేశాడు.

మరి కొన్నాళ్ళకి మరొక కంపెనీలో పనికి కుదిరి, భార్యాసమేతంగా మద్రాసు వచ్చి కాపురం పెట్టాడు. అక్కడ ఆఫీసుకే అధికారి అయ్యాడు.

ఇంటివద్ద వ్యవహారాలన్నీ అప్పుడప్పుడు ప్రక్కవూరునుంచి వస్తూ పినమామగారూ, అక్కడేవుంటూ అంకాలూ చూస్తూ వచ్చారు. శివరాం తనకి తోచిన పైకం ముక్తసరిగా మని ఆర్డర్లు చేస్తూనేవున్నాడు.

కాశీ వెళ్ళాలంటే వెలితి లేకుండా డబ్బు పంపించాడు. ఒళ్లు బాగా లేదని వ్రాయించినపుడల్లా అన్ని మందులూ పంపించాడు.

ఈ లోపుగా శివరామ్‌కి ఒక కూతురు పుట్టింది. కమల అని పేరు పెట్టాడు. తన పంచప్రాణాలూ ఆపిల్లమీదనే పెట్టుకుని బ్రతుకుతున్నాడు తండ్రి. తన తమ్ముడు అప్పుడప్పుడూ మనుమరాలిని చూడ్డానికొచ్చినపుడల్లా సంగతులన్నీ అక్కగారితో చెబుతూండేవాడు, తిరిగి వచ్చాక. ఒక్కొక్కప్పుడు, మనుమరాలిని తెచ్చుకున్నపుడల్లా, శ్రీదేవి గారింటికి తీసుకెళ్ళి, కొన్నాళ్ళుంచి మళ్ళీ మద్రాసు తీసుకొచ్చి వదిలి వెళుతూండేవాడు.

గడచిన మూడు మాసాల జబ్బులో ఇవన్నీ ఆలోచిస్తూండేది శ్రీదేవిగారు.

అయిదు రూపాయలూ, రెండు కుంచాల వడ్లూ ఇచ్చి దిమ్మరిగా తిరిగే జంగాల పిల్లాణ్ని కొని పెంచుకున్న అంకాలు పాటి అదృష్టం తనకి లేకపోయిందే. అంకాలు కొడుకుపాటి చెయ్యలేదే—తను స్వయంగా నెలలుమోసి కనిపెంచిన ముద్దుల కొడుకు. "అమ్మ, అయ్యః" అంటూ ఆ దిమ్మరి చూడు. వాళ్ళ వెనుక ఎల్లా తిరుగుతాడో: వీడికి కన్నతల్లి మీద లేశమాత్రం ప్రేమ వున్నట్లు లేదే! అంకాలు భార్యపాటి కూడా చెయ్యలేదా తను!

ఎక్కడో కాలంలో దూరాన ఒక రాత్రి. ఇరవై ఏండ్లనాటిమాట: "అమ్మా కమల పోయింది, వెళదాం రా" అన్నది ముద్దుల కొడుకు కంఠం. అంతే. ఈ యిరవై యేండ్ల శూన్యంలో మళ్ళీ ఆ పిలుపు వినలేదు తను. ఒక్కసారైనా వినాలని ఎంత-యెంతఆశపడిందో! కాని

ఆశలు నిరాశలౌతూవచ్చాయి. తన కొడుకు తనకి కానపుడు జీవితంలో అర్థంలేదు. ఇన్ని సంవత్సరాలూ కాచుకుంది ఆ ఒక్క పిలుపుకోసం.

ఎన్నిసార్లో కొడుకు నడుగుదామా అనుకుంది. ఎలా మాట్లాడడం? అసలే చేతకాదే! ఏమిటో, వివరం తెలీని బాధలు దేహాన్ని చుట్టుకున్నాయి. ఇక పక్షవాతంకూడా వచ్చింది. తీసుకొచ్చి దిగబెట్టమంటే శివరామ్ పినమామగారు, భద్రంగా తన అక్కగారిని తెచ్చి, ఒప్పచెప్పి, కొన్నాళ్ళుండి, మనుమరాలు కమలని "నాలుగు దినాలు మా యింట్లోవుండి వస్తుంది లె"మ్మని చెప్పి తీసుకెళ్ళారు.

మద్రాసులో శ్రీదేవిగారికి రాచభోగం జరుపుతున్నాడు శివరామ్. మందులు బాగా నడుస్తూనే వున్నాయి. పనిపాటలన్నీ మానుకుని శివరామ్ యింటివద్దనే వుంటున్నాడు. కాని "అమ్మా! ఎల్లావున్నా" వని మాత్రం ముఖాముఖిగా అడగడంకూడా లేదు.

శ్రీదేవిగారు నీరసించిపోతున్నారు. ఇహ యెన్నాళ్ళోలేవు— ఆవిడకి.

ఈ వేళే ఆఖరురోజని మళ్ళీ వక్కాణించారు డాక్టర్లు. కాని కట్టకడపటివరకూ చికిత్సలు జరపటం విధి అన్నారు, మందులు జరుగుతూనేవున్నాయి.

తంతి వెళ్ళింది. పినమామగారు భార్యతోనూ, కమలతోనూ బైలుదేరారు. అంకాలు వుగ్గబట్టలేక కూడా బైలుదేరాడు.

కోడలు శ్రీదేవిగారి గది వదలడంలేదు.

శ్రీదేవిగారు శక్తి తెచ్చుకుని కళ్ళతోకూడా వెతుకుతూండేవారు— ఆ కొడుకు స్వరంకోసం—పరితపిస్తూ.

ఆ రాత్రికూడా గడుస్తోంది.

శ్రీదేవిగారిది చాలా గట్టిప్రాణం అని డాక్టర్లు నిశ్చయించారు.

తిరిగి సూర్యోదయం అవుతోంది.

స్వామి పిలుపు రాలేదు.

కన్నకొడుకు పిలుపుకోసం ఆగారు శ్రీదేవిగారు.

బయట అరుగుమీద అంకాలు తలవంచుకుని కూచుని వున్నాడు. శివరామ్ ఎప్పటిలా డాక్టరువద్దనుంచి మందులు పట్టుకునివస్తూ, గుమ్మంలో నించి, "అమ్మా" అన్నాడు పరిపూర్ణప్రేమతో. గదిలో శ్రీదేవిగారికి యెక్కడో దూరాన దిగంతాల వెనకనుంచి వినబడినట్టు ఆ స్వరం వినిపించింది.

ఆమె కళ్ళల్లో నీళ్లు నిండాయి. కళ్లు వాటంతటవే విప్పారాయి—మహా తృప్తితో.

ఆ ఒక క్షణం కోసమే ఆ కళ్ళలో ఆ కాంతి ఆగివుంది—ఇంకా. శివరామ్ లోపలి మండువాలోకి వచ్చాడు. ఎదురుగా చూస్తూ "అమ్మా, కమలా ! వచ్చావుటే !" అన్నాడు.

గదిలో శ్రీదేవిగారి కండ్లు మూతలు పడ్డాయి. తల ప్రక్కకి వాలిపోయింది. కళ్ళ కొలుకులలోనుంచి నిండిన కన్నీళ్లు జారాయి.

పెరట్లోనించి పినమామగారి గొంతు వినిపిస్తోంది........"మనో మన్యుర్యమర్మృత్యుస్సతోౄ మిత్రో వాయురాకాశంః ప్రాణో లోకపాలః...."

* * *